# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల
# సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**ఇంగ్లీషు — THE VOICE OF TRUTH**

సోమవారము, బుధవారము — 9-00 to 9-15 p. m.

**హిందీ — SATYA SUSAMACHAR**

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 p. m.
ఆదివారము — 1-30 to 1-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము, శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మళయాళం — THE VOICE OF TRUTH**

మంగళవారము, శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

**SATYA VANI**
P.O. Box. 80
KAKINADA - 533 001

# సత్య వాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE | *Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **8** | మార్చి **1983** | సంపుటి **3**

# సంపాదకీయము

## దేవుని చిత్తాన్ని తెలుసుకొనే ఆవశ్యకత

### *(The Necessity of knowing God's will)*

లిఖింపబడిన వాక్యమగు బైబిలు ద్వారా దేవుడు తన చిత్తాన్ని బయలుపరచాడు (హెబ్రీ 1:1, 2). గనుక మనం పరలోకం వెళ్ళాలంటే దాన్ని విశ్వసించి దానికి విధేయులమవ్వాలి (యోహాను 17:17; రోమా 10:17; ప్రక 22:14).

లేఖనములను మనకు మనమే చదువుకొనుట ద్వారా దేవుని చిత్తాన్ని మనం తెలుసుకోగలము (ప్రక 1:3). మరల, సత్య వాక్యము నమ్మకముగా ప్రకటింపబడుటద్వారా కూడా దేవుని చిత్తాన్ని తెలుసుకోగలము. బోధకుని ప్రాముఖ్యతను గూర్చి చెబుతు పౌలు ఇట్లనెను : ఎందుకనగా ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వాడెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? విననివానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ

వారెట్లు విందురు? ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించు వారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడి యున్నది" (రోమా 10:13-15). మరల అతడిట్లనెను: "కాగా వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). దేవుని చిత్తాన్ని తెలుసుకొనే మూడవ మార్గము కూడా యున్నదని కొందరు చెప్పజూతురు. అది దేవుడే నేరుగా మానవునితో మాట్లాడతాడని లేదా అద్భుతరీతిగా తనచిత్తాన్ని తెలియజేస్తాడని యనునది. అది సత్యమా? అది కానేరదు. మానవుడు లేఖనములను తనకు తానే చదువుకొను నిమిత్తమును, బోధింపబడు నిమిత్తమును అవి ఇయ్యబడెను. ఇది యధార్ధము గనుక దేవుడే నేరుగా బోధ్యము చేసుకొనే అవుసరం లేదు. లేఖనములకు వేరుగా ఆయన మానవునితో మాట్లాడబోవుచున్న యెడల వాటిని లిఖితపూర్వకముగా ఇయ్యవలసిన పనిలేదు.

మానవుడు దేవుని వాక్యాన్ని చదివేటప్పుడు సత్యాభిలాషియై యుండవలెను. దేవుని చిత్తాన్ని తెలుసుకోడానికి నిష్కపటమైన ఆసక్తి కలిగి యుండవలెను. ఈవిధంగా లేకపోతే మానవ కల్పిత ఉపదేశముల వలన దురభిమాన హృదయముతో అతడు లేఖనములను చదువును. తత్ఫలితముగా దేవుని వాక్యములోని వర్తమానాన్ని అతడు గ్రహించ లేకపోవును. అట్లుగాక అతడు నిజంగా సత్యాన్ని అన్వేషించుచు మంచి మనస్తత్వముతో చదివినయెడల అతడు సత్యాన్ని సులభంగా తెలుసుకోగలడు. దేవుని వాక్యం బోధింపబడుటద్వారా సత్యాన్ని తెలుసుకోవడం సాధ్యమే అయినను, బోధకులద్వారా మోసగించబడుట, పెడదారిని పెట్టబడుట సాధ్యమే యను సంగతిని జ్ఞాపకముంచుకొన వలెను. ఇంకోమాటలో బోధకు లనేకులున్నను వారందరు సత్యాన్నే బోధించుచున్నామని చెప్పుకొనుచున్నను, వారిలో అనేకులు నిజానికి

మానవ కల్పిత ఉపదేశములను సిద్ధాంతములను బోధించుచున్నారు. మనం ఆత్మలను పరిశోధించాలని, అంటే బోధకులను పరీక్షించాలని అపో. యోహాను చెప్పాడు (I యోహాను 4:1). ఇంకో మాటలో వారి బోధను మనం పరీక్షించాలి. వారు బోధించేదాన్ని దేవుని వాక్యంతో పోల్చి చూడాలి. అది సత్యమే యని నిర్ధారణ చేసుకొన్న తరువాతనే దాన్ని మనం అంగీకరించాలి.

అయితే సత్యం తెలుసుకొంటేనే సరిపోదు. కొందరు లేఖనాలను సంవత్సరాల కొలది చదివారు. కొందరు దేవుని వాక్యం బోధింపబడు చుండగా వినేవారు. వారిలో అనేకులు దేవుని చిత్తమేమిటో తెలుసుకొన్నారు. దాన్ని గూర్చి వారు నీకు చెప్పగలరు. అయితే వారు ఇంకా దేవుని చిత్తానికి లోబడ లేనందున రక్షింపబడలేదు. సత్యమువలన మనకు మేలు చేకూరాలంటే మనం దాన్ని విశ్వసించుట మాత్రమే కాదు గాని దానికి లోబడాలి. దేవుని నెరుగనివారిని సువార్తకు లోబడనివారిని దండించుటకై క్రీస్తు ఒకానొక దినమందు మరల రాబోవుచున్నాడు (2 థెస్స 1:7-9).

మనము సత్యాన్ని గ్రహించి దానికి లోబడిన తరువాత దానిని యితరులకు బోధించాలి. మనము సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించాలని క్రీస్తు చెప్పాడు (మార్కు 16:15). మనము వెళ్ళి సమస్త జనాంగములకు బోధించాలని ఆయన చెప్పాడు (మత్తయి 28:19, 20). మనము దేవుని వాక్యాన్ని ప్రకటించాలని పౌలు హెచ్చరించాడు (2 తిమో 4:2). అయితే నిజంగా సత్యవాక్య బోధకులమై యుండాలంటే, సత్యాన్ని మనం ఎరిగి యుండాలి. అందువలననే దేవుని చిత్తాన్ని మనం తెలుసుకోవడం దానికి విధేయులవ్వడం ఎంతో అవసరం. మనం సత్యాన్ని ఎరుగకపోతే విధేయులగునంతగా దాని విశ్వసించకపోతే యితరుల కెట్లు బోధించగలము? అనేక సందర్భాల్లో ఒకని కేమి ఉపదేశించబడిందో దానినే అతడు బోధించ

గలడు. ఒకనికి అసత్యమే ఉపదేశించబడితే అతడు దానినే నమ్మును. దేవుని వాక్యం వినుటద్వారా విశ్వాసము కలుగునని పౌలు చెప్పాడు (రోమా 10:17). అయితే ఒకనికి అసత్యం బోధించబడితే అతడు దానినే నమ్మునను సంగతి అందరికి ఎరుకే. అంతేకాదు బోధించబడిన దానినే ఒకడు విశ్వసించినయెడల అతడు విశ్వసించినదానికే లోబడునను సంగతి విదితమే. అతడు సత్యాన్ని విశ్వసించినయెడల సత్యానికి లోబడును, అసత్యాన్ని విశ్వసించినయెడల అసత్యానికి లోబడును.

ఇంకో ప్రమాదమేమంటే ఒకడు రక్షింపబడుటకేమి చేయవలెనో అను దానినిగూర్చి, సంఘాన్నిగూర్చి, మరికొన్ని ప్రాథమిక సంగతులనుగూర్చి తెలుసుకొని వాటికి లోబడవచ్చును గాని అద్భుతములను గూర్చి, మత శాఖలతో సహవాసమును గూర్చి, నామము యొక్క ప్రాముఖ్యతనుగూర్చి, ఆరాధననుగూర్చి, అట్టి అనేక అంశాలను గూర్చిన సత్యాన్ని ఎరుగకపోవచ్చును. కాలం గడిచేకొలది అతడు ఈ అంశాలను గూర్చిన సత్యాన్ని నేర్చుకోవచ్చును గాని అతడు బోధించుటకు అప్పుడే సంసిద్ధుడు కానేరడు. మిడిమిడి జ్ఞానంతో బోధించుటవలన ఎక్కువే నష్టం వాటిల్లుతుంది గాని లాభం తక్కువ. సరిగదా ఒకడు బైబిలు బోధించని సంగతులు బోధించుటకు మొదలుపెట్టును. తత్ఫలితంగా ప్రజలు అసత్య సిద్ధాంతాల నంగీకరింతురు. సంఘము బలహీనపడును. వారు క్రీస్తు సంఘమనే పిలుచుకొనుచుండవచ్చును గాని నిజానికి వారు మతశాఖలవారు, మతశాఖల బోధలను బోధించుచు వారితో సహవసించుచు యున్నవారు.

అందువలన ఒకడు దేవుని చిత్తాన్ని చదువుట, ధ్యానించుట అత్యవసరమనే వాస్తవాన్ని మరల గ్రహించుదము. సత్యవాక్యము బోధింపబడుచుండగా విని విశ్వసించి దానికి లోబడుట అత్యవసరం. బోధకునిగా యుండాలన్నా, వాక్యోపదేశం చేయాలన్నా అతడు ప్రభువుకు నమ్మకముగా యుండాలి, స్థానిక సంఘారాధనలలో క్రమ

ముగా పాల్గొనాలి, వ్యక్తిగతంగా వాక్యపఠనం గావిస్తు యుండాలి. లేదా నమ్మకమైన క్రైస్తవులచే నడుపబడు బైబిలు తరగతులకు హాజరయ్యి దేవుని చిత్తాన్ని బాగుగా యెరిగి సత్యాన్ని మాత్రమే బోధించాలి. అప్పుడు ఆత్మలు రక్షింపబడును, స్థానిక క్రీస్తు సంఘములు స్థాపించబడును. అయితే నీకు తెలియనిదానిని, నీవు విశ్వసించని దానిని నీవు బోధించలేవని మనసునందుంచుకొనుము. నీకు కొంత మట్టుకే సత్యము బోధించబడినయెడల నీవు కొంతమట్టుకే సత్యాన్ని బోధించుదువు. అందువలననే మనం యితరులకు బోధించడానికి మొదలుపెట్టకముందు సంపూర్ణ సత్యాన్ని మనం తెలుసుకోవడం అత్యవుసరం. మనం ప్రజలకు మేలు చేయాలిగాని కీడు కాదు. ప్రజలు రక్షింపబడాలని కాంక్షించాలిగాని మోసగించబడాలని కాదు. మనం సత్యాన్ని బోధించాలిగాని అసత్యాన్ని కాదు. సత్యాన్ని బోధించి నప్పుడే దేవుని సంతోషపెట్టగలం. అప్పుడు మాత్రమే మన బోధకు దేవుడుకోరే ఫలితాలు లభించగలవు.

---

## అధికారయుక్తమైన దైవ వాక్కు

— టి. జ్ఞానానందం, కాకినాడ.

పరిశుద్ధ గ్రంధము అని మనము పిలుచు బైబిలు గ్రంధము క్రైస్తవ లోకమంతటికిని ప్రామాణిక గ్రంధమైయున్నది. అది లేని క్రైస్తవ గృహముండదని చెప్పవచ్చును. లక్షలకొలది బైబిలుప్రతులు దినదినము అనేక భాషలలో ముద్రితములై ప్రపంచములో నలు మూలల వ్యాప్తి జెందుచున్నవి. దీని వ్యాప్తి నరికట్టవలెనని శతృవులు సమకట్టిరి; నాస్తికులు దీని నెదురాడిరి; విమర్శకులు వివిధములైన వ్రాతలను వ్రాసిరి; మహారాజులీ గ్రంధ ప్రతులను తగులబెట్టిరి; భాషాంతరీకరణము చేయువారిని కాల్చి చంపిరి; అయినను నేటికిని అది నిలచియే యున్నది.

జీవిత సౌధమును కట్టువాని కదియే శిల్పి, పాపరోగ నిరూపణ కును నివారణకును అది పరమ వైద్యుడు, నీతి ఫలములు పండించగల కర్షకుడు, జీవిత యాత్రిలో వెలుగునిచ్చు దివ్యజ్యోతి, ఆధ్యాత్మిక ఆకలిని తీర్చు జీవాహారము, నీతికొరకై తృష్ణ గొనువారికి జీవజలము, దుఃఖితుల కాదరణకర్త, అన్ని కాలములందును, అన్ని పరిస్థితుల యందును మనలను క్షేమముగ వెంబడించు స్నేహితుడు.

బైబిలు గ్రంథములో 66 చిన్న గ్రంథములున్నవి. ఈగ్రంథము లన్నియు 16 వందల సంవత్సరముల కాలములో 40 మంది గ్రంథ కర్తలు వ్రాసిరి. వారందరు జీవితములో వేర్వేరు రకముల అంతస్తులకు చెందినవారు. వారిలో పండితులు, రాజులు, పశుల కాపరులు, జాల రులు మొదలగువారు గలరు. ఈ గ్రంథకర్తలు వేర్వేరు భిన్న తరగతు లకు జెందినవారైనను, మొదటి వానికిని చివరి వానికిని విశేష కాల వ్యవధి యున్నప్పటికిని వారందరి వ్రాతలలో నొక గొప్ప ఏకీభావము గలదని చూచుట ఆశ్చర్యకరమైన సంగతి. దేవుని పరిశుద్ధ లక్షణ ములు, మానవుని దౌర్భాగ్యస్థితి, పతితుడైన మానవుని రక్షించుటకు దేవుని ఏర్పాటు, మోక్షప్రవేశము, అంత్య తీర్పు మొదలగు ముఖ్యాం శములలో వీరందరి వ్రాతలలో గొప్ప ఏకీభావము గలదు. ఈ బైబిలు గ్రంథకర్తలు తాము పుట్టక పూర్వము జరిగిన సంగతులు వ్రాసిరి; లోక సృష్టిని గూర్చి వ్రాయగలిగిరి; తమ కాలమున రాజ్యములలో సంభవించు విపరీత సంఘటనలయొక్క భావములు తెలియజేయ గలిగిరి; రాబోవు కాలములో జరుగవలసిన సంగతులను తెలియజేసిరి; లోకాంతమును గూర్చి వ్రాయగలిగిరి. వారి వాక్కులు అధికార పూర్వకమైనవి. దేవుడే తమద్వారా మాటలాడుచున్నాడు అను దృఢ నిశ్చయతతో వారు పలికిరి. ఆలాగున వ్రాయగలిగిరి. ఇదంతయు చూచినపుడు ఒకటి స్ఫురింపక మానదు. అదేదన, బాహ్యమునకు

గ్రంథకర్తలు 40 మంది యున్నను, నిజమున కొక్కడే గ్రంథకర్త, అతడు పరిశుద్ధాత్ముడే అని నమ్మవలయును.

## బైబిలు — విజ్ఞాన శాస్త్రము

మరియు వైజ్ఞానశాస్త్ర సత్యములు లోకములో కనుగొనబడక పూర్వమే ఆ సత్యములు బైబిలులో లిఖితములై యుండుటను బట్టి దేవుడే ఈ గ్రంథమున కాధారభూతుడనుట నిర్వివాదాంశము గదా! ఉదాహరణకు కొన్నింటిని చూచెదము.

1. భూమి బల్లపరుపుగా నున్నదని కొన్ని వందల సంవత్సరములు నమ్మిరి, గాని అది గోళాకారముగా నున్నదని 16వ శతాబ్దములో వైజ్ఞానిక శాస్త్రము నిర్ణయించినది. ఈ సత్యమును క్రీ. పూ. 700 సం॥ల కాలములో యెషయా ప్రవక్త వెల్లడించెను. "ఆయన భూమండలముమీద (Circle of earth) ఆసీనుడై యున్నాడు"- (యెష. 40:22; సామె. 8:27).

2. భూమిని అష్టదిగ్గజములు మోయుచున్నవని మన పూర్వులు నమ్మెడివారు. గ్రీక్, రోమా దేశస్థులు అట్లాస్ అనువాడు తన భుజములపై మోయుచున్నాడనియు లేక నీటిపై తేలుచున్నదనియు నమ్మెడివారు. నవీన వైజ్ఞానిక శాస్త్రము భూమి ఆకాశములో ఏ ఆధారమును లేక వ్రేలాడుచున్నదని దృఢపర్చినది. కాని క్రీ. పూ. 1500 సం॥లకు పూర్వమే ఈ సత్యము బైబిలులో వ్రాయబడినది. "ఆయన శూన్యముపై భూమిని వ్రేలాడ జేసెను" (యోబు 26:7).

3. ప్రఖ్యాతి వహించిన వైజ్ఞాన శాస్త్రవేత్త హెర్బర్టు స్పెన్సర్, మానవ జ్ఞానమున కందనివి ఐదు సత్యములున్నవని 19వ శతాబ్దాంతమున చెప్పెను. గాని 3400 సం॥ల క్రితమే మోషే ఆ సత్యముల నొక్క వాక్యములో వెల్లడించెను (ఆది. కాం. 1:1).

| | | |
|---|---|---|
| Time | కాలము | ఆదియందు |
| Force | శక్తి | దేవుడు |
| Matter | పదార్థము | భూమిని |
| Space | విశాలము | ఆకాశమును |
| Action | క్రియ | సృజించెను |

4. సముద్ర జలములలో మార్గములు గలవని ఇటీవలయే మాత్యూఫాంటేనామారే అను క్రైస్తవ భక్తుడు కనుగొనెను. అతడు వ్యాధిగ్రస్తుడై పడకపై పరుండి కుమారుని బైబిలు గ్రంథము చదువమనెను. కుమారుడు కీర్తనల గ్రంథమునుండి చదువుచుండెను. "ఆయన సముద్ర మార్గములలో సంచరించు వాటిని ......" (8 : 8) అని చదువుచుండ, తండ్రి "ఆగుము ... సముద్రములలో మార్గములు గలవా ? కలవని దేవుని గ్రంథము చెప్పిన అది సత్యమే. నేను ఆరోగ్యవంతుడనైన పిదప దానిని కనుగొందును" అని చెప్పి పరిశోధనలు జరిపి అట్లే కనుగొనెను. అతడు సముద్రగర్భ శాస్త్ర (oceonography) పరిశోధకుడు. అతడు కనుగొన్న సత్యము ఓడనావికుల కెంతో ఉపయోగకరముగ నున్నది.

5. ప్రకృతికి ఆధారభూతమైనది మూడు విధములని వినయన్ శాస్త్రవేత్త 1735 లో వక్కాణించినాడు. అవి ఖనిజములు, వృక్షజాతులు, జంతుజాతులు. కాని అంతకుముందే సుమారు 3500 సంవత్సరముల క్రిందట ఆ సత్యమును మోషే ఆదికాండము మొదటి అధ్యాయములో చూపించినాడు. 1:1-10 లో ఖనిజములు, 11-19 వచనములలో వృక్షజాతులు, 20-31 వరకు జంతుజాలములు, వీని సృష్టినిగూర్చి మోషే వరుసగా వివరించినాడు.

6. రక్తము ప్రాణాధారమని 17వ శతాబ్దములో శాస్త్రజ్ఞులు చెప్పిరి, కాని లేవీ కాండము 17వ అధ్యాయములో ఆ సత్యమును మోషే అనేక వందల సంవత్సరముల క్రిందటనే చెప్పినాడు.

7. సముద్రంలో మంచినీటి ఊటలు కలవని 1932లో శాస్త్రజ్ఞులు కనుగొనిరి, కాని క్రీ.పూ. 1500 సంవత్సరముల క్రిందట వ్రాయబడిన యోబు గ్రంథములో దానిని చూడగలము (38:16).

8. గాలికి బరువు కలదని 16వ శతాబ్దములో కనుగొనిరి, కాని బైబిలులో క్రీ.పూ. 1500 సంవత్సరముల క్రిందట ఆ సంగతి వ్రాయబడినది (యోబు 28:25).

మరియు యెరూషలేము నాశనమును గూర్చియు బబులోను, ఈజిప్టు, పారసీక, రోమా సామ్రాజ్యముల పతనమును గూర్చియు బైబిలులో ప్రవచించబడినట్లే జరిగెను. యేసుప్రభుని గూర్చి పాత నిబంధన గ్రంథములో 333 ప్రవచనములు గలవని కొందరి అంచనా. వాటిలో అనేకములు నెరవేరినవి. కనుక తక్కినవి కూడా ఆయన రెండవ రాకకును, లోకాంతమునకు సంబంధించినవి. అవియును తప్పక నెరవేరునని నమ్మగలము. అందుచే బైబిలు గ్రంథము అద్వితీయమైనదనియును, దైవావేశమువలననే వ్రాయబడినదనియును నమ్మగలము.

## వ్రాయబడిన గ్రంథము

పాత నిబంధనలోని 39 పుస్తకములు హెబ్రీ భాషలో వ్రాయబడినవి. అవి యూద జనాంగములో దైవ వాక్కులుగ నెంచబడినవి. యేసుప్రభు, "లేఖనములు" అని ఆయా సమయములలో వాడిన మాట వానిని గూర్చియే (యోహా 5:39).

మరియు అవి మూడింటిగ విభాగించబడినవి. మోషే ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథములు, కీర్తనల గ్రంథము. (లూకా 24 : 44).

యూదులచెర అనంతరమున యాజకులును, లేవీయులును దేవాలయమును పోగొట్టుకొన్నవారై లేఖన ప్రతులను చేకూర్చుటకును, వాటికి వేరు ప్రతులు తయారు చేసికొనుటకును ఉపక్రమించిరి.

అనేక గ్రంథముల జాబితానుండి ప్రామాణిక గ్రంథములుగ నుండదగని వాటిని నిరాకరించి 39 గ్రంథములుమాత్రము ప్రామాణిక గ్రంథములని తేల్చిరి. ఇట్లు తేల్చుట తేలికైన విషయము కాదు. అనేక పర్యాయములు పండితులైనవారు కూడుకొనుచు, కొన్ని గ్రంథములను నిరాకరించుచు, మరొక పర్యాయము వానిని మరల చేర్చి, మరికొన్ని తీసివేయుచు, ఈలాగు అనేక సంవత్సరముల కాలములో అనేక పర్యాయములు చేయుచు, చివరకు క్రీ.శ. 100 సం॥నకు పాతనిబంధన ప్రామాణిక గ్రంథములను సంపూర్తి చేసిరి. అవి నేడు మనకుగల పాతనిబంధనలోని 39 గ్రంథములు. క్రొత్తనిబంధన గ్రంథరూపముగ వెలువడకముందే క్రైస్తవ సంఘములు వ్యాపించ దొడగినవి. ఆయా సంఘములలో కొన్ని వ్రాతలు జదువ నారంభించిరి. సువార్తలును, పత్రికలును, ఒక సంఘమునుండి మరొక సంఘమునకు సంచారము చేయదొడగినవి. చాల సంఘములు వాని కాపీలు తయారు చేసుకొన్నవి. క్రొత్తనిబంధన గ్రంథములన్నియు గ్రీకు భాషలో వ్రాయబడినవి. అయినను క్రీస్తు శకము 150 నుండి 250 సం॥ల మధ్య కాలములో లాటిన్, సిరియన్, ఈజిప్షియన్ భాషలలోనికి క్రొత్త నిబంధనలోని పుస్తకములు చాలవరకు తర్జుమా చేయబడినవి. క్రొత్త నిబంధనకు సంబంధించినవి 4 వేలకన్నా ఎక్కువ ప్రాచీన ప్రతులు నేడున్నవి. ఆ ప్రతులలో కొన్నిటియందుమాత్రమే, పూర్తి క్రొత్త నిబంధన లభించును.

ఆయా సంఘములలో వ్యాప్తిజెంది ప్రజల మనస్సుల నాకర్షించుచున్న క్రొత్త నిబంధన పుస్తకములు 27ను, సంపూర్ణముగ క్రీస్తుశకం 400 సం॥నకు ముందే ప్రామాణిక గ్రంథములుగ నెంచబడినవి.

బైబిలు గ్రంథములో నేడున్నట్టుగా, అధ్యాయ విభాగములు, వచనముల విభాగములు ప్రారంభమున లేవు. బైబిలును 13వ శతాబ్ది

ములో స్టీవెన్ లాంగ్టన్ అనునతడు అధ్యాయములుగ విడదీసెను. తరువాత సుమారు 300 సంవత్సరములకు, స్టెఫినాన్ అను ఫ్రెంచి దేశీయుడు వచనములుగ విడదీసెను. గనుకనే మనము బైబిలును బాగుగా ఉపయోగించుకొనుటకు వీలైనది.

## అప్రమాణిక గ్రంథములు (అపోక్రిఫా)

పైన చెప్పబడిన 66 పుస్తకములుగాక మరికొన్ని గ్రంథములు ఆ దినములలో వ్రాయబడినవి. ఆ గ్రంథములలో 14, అనగా ఎస్రదాసు గ్రంథములు, మక్కబీయుల చరిత్ర, సోలోమోను జ్ఞాన గ్రంథము మొదలైనవి పాత నిబంధనకు చెందినవి. 15 గ్రంథములు అనగా యేసుయొక్క బాల్యమునకు చెందిన సువార్తలు, పునరుత్థానంతరము యేసుయొక్క సంభాషణలు, బర్నబా పత్రిక, 12 గురు అపొస్తలుల బోధలు మొదలగు పుస్తకములు క్రొత్తనిబంధనకు చెందినవి. మరియు వీనిలో కొందరి గ్రంథకర్తల పేర్లు సంశయాస్పదమైనవి. మరికొన్ని గ్రంథములలో కేవలము కల్పిత గాధలు గలవు. అందుచేనివి ప్రామాణిక గ్రంథములలో చేర్చబడ లేదు.

రోమన్ కేతొలిక్ సంఘము పాత నిబంధనకు చెందిన గ్రంథములలో 11 అపోక్రిఫా అనబడు వాటిని తమ బైబిలులో చేర్చిరి. ప్రొటెస్టాంటువారు, వాటిని అంగీకరించక చరిత్ర జ్ఞానము కొరకును, ఆధ్యాత్మిక ప్రయోజనము కొరకును వానిలో కొన్ని చదువవచ్చును అని చెప్పుదురు. (సశేషము)

---

## దేవుని కసాధ్యమైన దేదియును లేదు

### *(For with God Nothing is Impossible)*

దయాపాత్రురాలా నీకు శుభము. ప్రభువు నీకు తోడైయున్నాడని దైవదూత చెప్పిన ఆ మాటకు కన్య మరియ బహుగా

తొందరపడి ఈ వచనమేమిటో అని ఆలోచించుకొనుచుండగా దూత- మరియా భయపడకుము; దేవునివలన నీవు కృప పొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టు దువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును అని చెప్పిన ఆ మాటకు మరియ నేను పురుషుని ఎరుగనిదానినే; యిదే లాగు జరుగునని దూతతో అనగా, దూత - పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును. మరియు నీ బంధువు రాలు ఎలీసబెతుకూడా తన వృద్ధాప్యమందు ఒక కుమారుని గర్భము ధరించియున్నది. గొడ్రాలనబడిన ఆమె కన్నది. ఆరవనెల, దేవుడు చెప్పిన ఏ మాటయైనను నిరర్థకము కానేరదని ఆమెతో చెప్పెను (లూకా 1:34-37).

యేసుక్రీస్తు యెరూషలేములో బోధించుచుండగా ఒక యువ కుడు ఆయన యెదుట మోకాళ్ళూని బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయుదునని ఆయననడిగెను. అతడు మోషే చట్టబద్ధుడైనందున ఆ ఆజ్ఞలప్రకారము అనుసరించుమని ఆయన చెప్పెను. అందుకతడు-బోధకుడా, బాల్యమునుండి ఇవన్నియు అనుస రించుచునే యుంటినని చెప్పెను. యేసు అతనిని చూచి అతని ప్రేమించి నీకు ఒకటి కొదువగా వున్నది. నీవు వెళ్ళి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము. పరలోకమందు నీకు ధనము కలుగును. నీవు నీ సిలువ నెత్తుకొని నన్ను వెంబడించుమని చెప్పెను. అతడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖ పడుచు వెళ్ళిపోయెను. అప్పుడు యేసు చుట్టూ చూచి- ఆస్తిగలవారు దేవుని రాజ్యములో ప్రవేశించుట ఎంతో దుర్లభమని తన శిష్యులతో చెప్పెను. ఆయన మాటలకు శిష్యులు విస్మయమొందిరి. అందుకు యేసు తిరిగి వారితో ఇట్లనెను- పిల్లలారా, తమ ఆస్తియందు నమ్మిక

యుంచువారు దేవుని రాజ్యములో ప్రవేశించుట ఎంతో దుర్లభము. ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుటకంటే ఒంటె సూది బెజ్జములో దూరుట సులభము" అందుకు వారు అత్యధికముగా ఆశ్చర్యపడి - అట్లయితే ఎవడు రక్షణ పొందగలడని ఆయన నడిగిరి. యేసు వారిని చూచి ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి అసాధ్యము కాదు. దేవునికి సమస్తమును సాధ్యమే అనెను (మార్కు 10:21-27).

సృష్టి మొదలు శతాబ్దముల తరబడి జరుగుచున్న నిత్య సత్య మేదనగా - ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను. భూమి నిరాకారముగాను, శూన్యముగాను ఉండెను. దేవుడు అలా కమ్మని పలుకగా అవి కలిగెను. దేవుడు ఈ ధరణిపై జీవించుటకు నేల మంటితో మొదటి నరుని సృజించెను. దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని, మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు (యోహాను 5:28, 29). మానవుడు తన పాపపు చేతులెత్తి పాపక్షమాపణ అడుగ లేని నిస్సహాయస్థితిలో నున్నప్పుడు మన పాపముల నిమిత్తము దేవుడు తన ప్రియమైన ఏకైక కుమారుని ఆ కొయ్యసిలువపై మరణించుటకు అర్పించెను. అందుకే అపొస్తలుడైన పౌలు 1 కొరింథి 1 : 18 లో "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెఱ్ఱితనముగాని, రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి అని బోధించెను."

ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణ బడలిక చేత అలసి నందున దేవునికిని మోషేకును విరోధముగా మాటలాడి - ఈ అర ణ్యములోనికి మమ్ము నెందుకు రప్పించితిరి అని సణుగుచుండిరి. ప్రార్థించి వారి అవసరతలు అడుగుటకు బదులు ఇక్కడ ఆహారము లేదు, నీళ్ళు లేవు, చవిసారములేని యీ అన్నము మాకు అసహ్యమైన

దనిరి. "అందుకు యెహోవా ప్రజలలోనికి తాపకరములైన సర్పములను పంపెను; అవి ప్రజలను కరువగా ఇశ్రాయేలీయులలో అనేకులు చనిపోయిరి. కాబట్టి ప్రజలు మోషేయొద్దకు వచ్చి - మేము యెహోవాకును, నీకును విరోధముగా మాటలాడి పాపము చేసితిమి; యెహోవా మా మధ్యనుండి ఈ సర్పములను తొలగించునట్లు ఆయనను వేడుకొనుమనిరి. మోషే ప్రజలకొరకు ప్రార్థన చేయగా యెహోవా - నీవు తాపకరమైన సర్పమువంటి ప్రతిమను చేయించి స్తంభముమీద పెట్టుము; అప్పుడు కరవబడిన ప్రతివాడును దాని వైపు చూచి బ్రదుకునని మోషేకు సెలవిచ్చెను. కాబట్టి మోషే ఇత్తడి సర్పమొకటి చేయించి స్తంభముమీద దానిని పెట్టెను. అప్పుడు సర్పపు కాటు తినిన ప్రతివాడు ఆ యిత్తడి సర్పమును నిదానించి చూచినందున బ్రదికెను" (సంఖ్యా కాండము 21:6-9).

మరియు మనము నయమానును గూర్చి చదివిన-అతడు సిరియా రాజు యొక్క సైన్యాధిపతి, మహా పరాక్రమశాలి యని బైబిలు బోధించుచున్నది. కాని అతడు కుష్ఠరోగి. ఇశ్రాయేలు దేశమునందు దైవజనుడైన ఎలీషా అను ఒక ప్రవక్త తన కుష్ఠరోగమును బాగు చేయగలడని విని తడవుచేయక దైవజనుని యింటి ద్వారము ముందర నిలిచియుండగా ఎలీషా - నీవు యొర్దానునదికి పోయి యేడుమారులు స్నానము చేయుము, నీ ఒళ్ళు మరలా బాగై నీవు శుద్ధుడవగుదువని అతనితో చెప్పుటకు ఒక దూతను పంపెను. అందుకు నయమాను కోపము తెచ్చుకొని తిరిగిపోయి యిట్లనెను - అతడు నాయొద్దకు వచ్చి నిలిచి, తన దేవుడైన యెహోవా నామమునుబట్టి తన చెయ్యి రోగముగా వున్న స్థలముమీద ఆడించి కుష్ఠరోగమును మాన్పునని నేననుకొంటిని. దమస్కు నదులైన అబానాయును, ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటికంటె శ్రేష్ఠమైనవి కావా? వాటిలో స్నానము చేసి శుద్ధినొందలేనా? అనుకొని రౌద్రుడై తిరిగి వెళ్ళిపోయెను.

అయితే అతని దాసులలో ఒకడు వచ్చి-నాయనా ఆ ప్రవక్త యేదైన ఒక గొప్ప కార్యము చేయమని నియమించినయెడల నీవు చేయకుందువా? అయితే స్నానముచేసి శుద్ధుడవు కమ్మను మాట దానికంటె మేలు కాదా? అని చెప్పినప్పుడు అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడుమారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను (2 రాజులు 5:10-14).

నేడు మనకొరకు దేవుని సందేశమేమనగా క్రీస్తు ప్రభువనియు, మన పాపముల నిమిత్తము ఆ ఘోర సిలువ మరణము పొందియున్నాడనియు నమ్మి పశ్చాత్తాప హృదయముతో నీటిలో మునుగుటద్వారా బాప్తిస్మమును పొంది రక్షింపబడవలెను (మార్కు 16:16; అపొ.కా. 2:38; రోమా 6:3, 4). కాబట్టి అలా చేయుటద్వారా ఇశ్రాయేలీయులు అరణ్యములో ఇత్తడి సర్పమును చూచి బ్రదికినట్లును, కుష్ఠరోగియైన నయమాను యొర్దాను నదిలో ఏడుమారులు మునిగి తన కుష్ఠరోగమునుండి బాగుపడినట్లును మనముకూడా దేవుడిచ్చిన ఆజ్ఞ ప్రకారము నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడవలెను.

అవును, మన దేవుడు మన ఊహలకందని సర్వశక్తిమంతుడు. ఆయనను నమ్ముకొని ఆయన చిత్తప్రకారము నడుచుకొనినయెడల ఆయన మనలను రక్షించి కాపాడి నిత్యజీవమార్గమునకు మనలను నడిపించును. ఆయన కసాధ్యమైన దేదియును లేదు.

— సన్నీ డేవిడ్, న్యూఢిల్లీ.

---

## యేసును వెంబడించిన పండ్రెండుగురు-12

## ఇస్కరియోతుయూదా: అతనిగూర్చియేమిచెప్పుకొందుము?

## *(Judas Iscariot : What shall we say of him ?)*

యేసు ఆ పదకొండుమందిని మేల్కొలిపినప్పటినుండి ఆయా సంఘటనలు త్వరితగతిని జరిగాయి. గత్సేమనే చెట్లగుండా వచ్చు

చున్న కాగడాల కాంతిని వారిప్పుడు చూడగలుగుచున్నారు, ఖడ్గముల ధ్వనిని వినగల్గుచున్నారు. ఆ జనసమూహము వెంటనే వారి యెదుటకు వచ్చింది. దానిలో నుండి వారిలో ఒకడగు ఇస్కరియోతు యూదా ప్రత్యక్షమయ్యాడు! అతడు యేసుకు శుభవచనం పలుకుచున్నట్లేదో అగుపడ్డాడు- గాని అతడు యేసుకు పెట్టిన ముద్దుద్వారా ఆయనను హింసించడానికి, కొట్టడానికి, విమర్శచేయడానికి, చివరకు కల్వరి కొండపై సిలువవేయడానికి అప్పగించాడని వారు తెలుసుకున్నారు.

గత్సేమనే నుండి కల్వరివరకు జరిగిన ఈ కొద్ది సమయములో అనేకులకు ఖ్యాతి లేక అపఖ్యాతి నెలకొల్పబడింది. యేసు హింసలో విజేయుడయ్యాడు. ప్రజల ఒత్తిడి వలన చట్టబద్ధమైన న్యాయం జరుగ నీయలేక పోయినందు వలన కలిగిన అపరాధ భారమును నిష్ఫలంగా పిలాతు కడిగివేసుకోబోయాడు. క్రీస్తును అప్పగించిన యూదా (మత్తయి 10 : 4; మార్కు 3 : 19) అయితే నమ్మకద్రోహి, గురు ద్రోహి అయ్యాడు (లూకా 6:16). యూదాను తన క్రియయొక్క నీచత్వము నుండి ఏ విధంగాను మనం విడుదల చేయలేము. అయితే అతన్ని గూర్చి యేమిచెప్పబడిందో దానిని తెలుసుకొంటూ మనకొరకు అతని జీవితం యొక్క భావాన్ని గ్రహించుకోగలం.

మొదటిగా అతన్నిగూర్చి గొప్ప మర్మములు చుట్టుముట్టి కొని యున్నవని మనం గ్రహించాలి. అతని పేరులోని భావం, అతని పూర్వోత్తరం, అతని శీలం, క్రీస్తును అప్పగించుటలో అతని ఉద్దేశ్యం, అతని మరణంయొక్క ఖచ్చిత వివరాలు-ఇవన్నీ గొప్ప మర్మాలే. అతని పేరుయొక్క భావాన్ని గూర్చిన రెండు వివరణము లను మనం చూచుకొందము.

ఇస్కరియోతు (Iscariotas) అను పదముయొక్క అర్థము రాజద్రోహి, నరహంతకుడు కావచ్చును (అపొ.కా. 21:38). అట్లయితే యూదా ఇంతకు పూర్వం యూదుల జాతీయవాది (Nationalist)

అయ్యుండవచ్చును. ఈవిషయంలో తన కలలు నెరవేరగలవనే ఆశతో అతడు యేసుతో చేసుకొని యుండవచ్చును. అతడు ప్రగాఢమైన జాతీయవాది గనుక యేసును అప్పగించుటలో అతని ఉద్దేశములు రెండు విధములుగా యుండవచ్చును. మొదటిగా యేసు విజయోత్సవముతో యెరూషలేములో ప్రవేశించిన నాటినుండి జరిగిన సంఘటనలు రోమా సామ్రాజ్యపు కాడి నెట్టివేయబడి దావీదు సామ్రాజ్యము మరల స్థాపింపబడుటకు గాక (మార్కు 11:8-10), యేసు హింసింపబడుటకును, చంపబడుటకును ఉపక్రమించగా ఘోరముగా నిరుత్సాహవంతుడై అతడు రాజద్రోహి లేక గురుద్రోహి అయ్యాడు (మార్కు 12:1-11). యేసు చంపబడితే ఆయన శిష్యులందరు చివరకు చంపబడుదురని అతడెరుగును (మార్కు 13:4-13). గనుక ఈ విప్లవమంతయు విషాదాంతము గాకముందు యూదా, "ప్రభుత్వపు సాక్షిగా" మారి అధికారుల తరపున యుండగోరెననుట బహుశ సమంజసమే (మార్కు 14:10-11). అట్లయినప్పుడు యూదా ఎందుకు ఆత్మహత్య చేసుకొన్నాడో ఈ వివరణ తెలియజేయడం లేదు.

రెండవదిగా అతడు "పొరబడ్డ జాతీయవాది" అనే భావన. దీని ప్రకారం నిజంగా యూదుల అధికారులవలన పట్టుబడ్డప్పుడు క్రీస్తు ఇంకేమీ సందేహించక తక్షణమే తన భూసామ్రాజ్యాన్ని స్థాపిస్తాడనే ఉద్దేశంతో యూదా యేసును అప్పగించాడనునది. అతడు యేసును అప్పగించడానికి, తరువాత ఆత్మహత్య చేసుకోవడానికి ఈ సిద్ధాంతం కారణాలను చెప్పుచున్నను (యేసు నిజంగా హత్య చేయబడ్డాడని చూచి అతడు తన్నుతాను చంపుకొన్నాడు), లేఖనాలను పారంపర్యాన్ని అది పరిగణించుట లేదు. ఈ రెండింటిలో ఏదియు కూడా యూదా యొక్క అపరాధాన్ని కప్పివుచ్చుట లేదు. యేసు ఏర్పరచుకొనిన వారిలో ఒకడు ఔదార్య కారణములవలన గాక వేరే కారణముల వలన ఆయనను అప్పగించెనను వాస్తవాన్ని కూడ అవి కప్పివుచ్చుట లేదు.

## యూదా యొక్క ఏకైకత

యూదయలోని తన నివాస స్థలమగు కెరీయోతునుబట్టి (యెహోషువ 15:25) ఇస్కరియోతు అనునది బహుశ అతని యింటి పేరు కావచ్చును (యోహాను 6:71; 13:26). దీన్నిబట్టి ఆ పండ్రెండు మందిలో గలిలయుడు కానివాడు యూదా ఒక్కడే అని అర్థమగుచున్నది. అతడు యేసుయొక్క ప్రాముఖ్య శిష్యులలో ఒకడగుటచే అతని ఏకైకత విశిష్టమగుచున్నది. డబ్బుసంచి ఎల్లప్పుడు అతని దగ్గరే యుండేది. ఆఖరి భోజన సందర్భముగా అతడు యేసు ప్రక్కనే ఘనత గల స్థానంలో యున్నాడు (యోహాను 12:6; 13:21-27). అయినను అతడు పేతురు యాకోబు యోహానులవలె బహు సన్నిహిత శిష్యుడు కాదు. సరిగదా యేసుయొక్క పని విషయంలో అతడు ఏమాత్రం ఏకాగ్రత కలిగినవాడు కాడని అగుపడుచున్నది. ఆయనను అప్పగించే సమయంలోనే గాక (లూకా 22:3; యోహాను 13:27), ఆయన యందు విశ్వాసము కలిగియుండుట కష్టముగా అగుపడుచున్న సమయములలోను కూడ అతడు సాతాను శక్తులకు లోనైనవాడని పరిగణింపబడేది (యోహాను 6:66–71). డబ్బుసంచి తనయొద్ద ఉంచుకొనుటలో నైతిక బాధ్యతను అతడు అంగీకరించినను దానినుండి పదేపదే దొంగిలించేవాడు (యోహా 12:6). ఈ విషయంలో ఆర్థిక సమస్యలను గూర్చి యేసుయొక్క దృక్పథాలకు యూదా పనులు భిన్నముగా యున్నవి (మార్కు 10:17-31; లూకా 12:5-20). యూదా ఎన్ని చెప్పినను బీదలనుగూర్చి తన యజమానికున్న ఆసక్తిని, శ్రద్ధను అతడు కలిగియుండలేదు (యోహా 12:6). యేసును బంధించుటను గూర్చి యోచించుటకు అతడు యూదుల అధికారుల దగ్గరకు వెళ్ళుటలో ముందెన్నడు లేనట్లుగా అతడు యేసుతో తన సంబంధాన్ని తెగ తెంచుకొన్నాడు. అయినను యేసుయొక్క అధీనతలో ఒక వ్యక్తివలె ఎంతమట్టుకు ఉన్నాడంటే యేసుకు మరణ శిక్ష విధించబడుట చూడ

గానే ఆత్మహత్య చేసుకొన్నాడు. యేసు తన్ను తాను విడిపించుకోగల
ననే నమ్మకంలోను, తన విద్రోహాకచర్యలో ద్రవ్యార్జన చేసుకో
గలననే దురాశలోను ఎప్పటివలె తాను అందరికంటే ముందే ఉంటా
ననుకొన్నాడు.

## యూదా యొక్క నిరాశ

ఇస్కరియోతు యూదా మరణంలో, క్రీస్తుయొక్క ఆత్మనుండి అతడు ఎన్నటికీ వేరై పోవుట మనం చూడగలం. నిరపరాధి రక్తమును అప్పగించినందువలన కలిగిన అపరాధ భారమును బట్టి ఆయనకు జరుగుచున్న విమర్శను అతడు అరికట్టాలని, తారుమారు చేయాలని ప్రయత్నించి విఫలుడైనందువలన అతడు జీవితాన్నిగూర్చే నిరాశ జెందాడు (మత్తయి 27:3-10). తన క్రియవలన అనేక విషాదాంత సంఘటనలు సంక్రమించాయని అతడు గమనించాడు. తాను శక్తిహీనుడని తన ఆశలన్నీ నిరాశలనీ అతడు గమనించాడు. తన నిరాశలో శిష్యత్వము యొక్క మరొక ప్రాముఖ్య సత్యమును అతడు గమనించలేదని నిరూపించుచున్నాడు. అదేమంటే మానవుడు తన క్రియలవలన తాను సంపాదించలేనిదీ, దేవుని కృపవలన మాత్రమే ఎంత ఘోర దుష్క్రియకైనను క్షమాపణ పొందవచ్చునను దానియొక్క భావాన్ని అతడు గ్రహించలేదు (లూకా 22 : 31-34; యోహాను 8 :.1-11; ఎఫెసీ 2 : 8-10).

ఎన్నటికీ క్షమింపబడలేని వారిలో యూదా తప్పక యుంటాడని మనం అనుకొనుచున్నయెడల, సిలువయొక్క అపరాధము కేవలం అతనిది మాత్రమే కాదని మనం జ్ఞాపకముంచుకొనాలి: పిలాతు సంగతి యేమిటి? యూదుల సమాజమందిరం సంగతి యేమిటి? యూదుల జన సమూహం? రోమా సైనికులు? అంతేకాదు పాపములేని వాడే మొదట రాయి విసరవలెనని మనం జ్ఞాపకముంచుకొనాలి. అందువలన యూదాకు వేరైన తరగతిలో మనలను మనం ఉంచుకోలేము. ఎందు

వలనం టే వందలకొలది విధాలుగా మన కోరికలు నెర వేర్చుకోవడానికి మనం క్రీస్తును అప్పగించుచున్న అపరాధులము.

## మనకొక హెచ్చరిక

దుష్కార్యము చేయడానికి మనకున్న శక్తిని గూర్చి యూదా యొక్క జీవితం మనలను హెచ్చరించుచున్నది. క్షమాపణ మానవునిలో కాదు గాని దేవునిలోనే కనబడుచున్నదని దేవునినుండే దాన్ని పొందగలమని అది మనకు తెలియజెప్పుచున్నది. క్రీస్తు మరణాన్ని గూర్చి దేవుని ఆవేదనను గూర్చి మనము కూడా అపరాధులమే యని అది చెప్పుచున్నది. యూదా యొక్క స్మృతులను మరచిపోవడానికి మనలో యున్న దార్ఢ్యము, సోమరితనం చాల గొప్పవి.

—Y.V. హెరాల్డ్

---

సంక్షిప్త ప్రసంగము

## దేవుని సంతోష పరచుట

*(Pleasing God)*

**పరిచయము :**

1. I థెస్స 4:1 చదువుము.
2. దేవుని సంతోషపెట్టుటను గూర్చిన ప్రసంగాన్ని నీవెప్పుడు విన్నావు? ఆ యంశాన్ని గూర్చి కనీసం నీవెప్పుడు విన్నావు?
3. దేవుని సంతోషపరచడాన్ని గూర్చి బైబిలు ఎంతో వర్ణించుచున్నది.
4. అందరు దేవుని సంతోషపరచుటకు ఎంచుకొంటే ఈలోకం ఎంత వేరుగా యుండునోగదా! సంఘము ఎంత వేరుగా యుండునో గదా!

## మన మాదిరి క్రీస్తు :

1. యేసు తాను చేసిన దంతటిలోను దేవుని సంతోషపరచెను-
   a) ఆయన తననుతాను సంతోషపెట్టుకోలేదు. రోమా 15:3
   b) ఆయన ఎల్లప్పుడు దేవునినే సంతోషపరచెను. యోహాను 8:29
   c) సత్క్రియలలో సంతోషపరచెను. మత్తయి 12:8; యెషయా 42:1
   d) దేవుని ప్రివక్తవలె సంతోషపరచెను. మత్తయి 17:5
   e) బాప్తిస్మము పొందుటలో దేవుని సంతోషపరచెను. మత్తయి 3:17
2. ఉన్నదంతటిలోను యేసు దేవుని సంతోషపరచెను :
   a) సర్వ సంపూర్ణతలో. కొలస్స 1:19
   b) దేవత్వముయొక్క సర్వ పరిపూర్ణతలో. కొలస్స 2:9

## దేవుని సంతోషపరచు విధములు :

1. మానవ శరీరము మరియు సంఘముకూడ దేవుని సంతోషపరచును. I కొరింథీ 12:18
2. సంఘమును మానవ శరీరముతో పోల్చినప్పుడు మానవ శరీరము దేవునికి సంతోషదాయకముగా యున్నట్లు పౌలు చెప్పెను.
3. జీవము గల ప్రతిదానికి దేవుడే తన చిత్తప్రకారము శరీరము నిచ్చును. I కొరింథీ 15:38
4. సత్యము ప్రకటించుటవలన దేవుడు సంతోషించును.
   a) I కొరింథీ 1:21
   b) I థెస్స 2:4
   c) ఏదో ఒకటి ప్రకటిస్తే దేవుడు సంతోషించడు. అట్లయితే సాతానుడు కూడా ప్రకటించుచున్నాడు. 2 కొరింథీ

11 : 13-15. గాని సత్యాన్ని ప్రకటిస్తే దేవుడు సంతో
షిస్తాడు.

d) సువార్త ప్రకటనకు నీవు కానుకలిస్తే దేవుడు సంతోషిస్తాడు!
ఫిలిప్పీ 4:15-18

e) అంగీకార యోగ్యమైన ప్రార్థనవలన దేవుడు సంతో
షిస్తాడు. I యోహాను 3:22

f) దేవుని ఆజ్ఞల ననుసరించి పనిచేయు క్రైస్తవులవలన దేవుడు
సంతోషించును. ఫిలిప్పీ 2:12, 13; హెబ్రీ 13:20, 21.

g) మన మాయనతో నడిచినయెడల దేవుడు సంతోషించును.
. ఆది 5:22; హెబ్రీ 11:5

h) తలిదండ్రులకు లోబడు పిల్లలవలన దేవుడు సంతోషించును.
కొలస్స 3:23

పిల్లలు తలిదండ్రులకు లోబడునప్పుడు తలిదండ్రులు సంతో
షిస్తారు, పిల్లలు దీవించబడతారు. పిల్లలు తమ తలిదండ్రు
లకు లోబడునప్పుడు దేవుడు సంతోషించునని పౌలు
హెచ్చరించాడు.

ముగింపు :

1. నీవు దేవుని సంతోషపరచుచున్నావా ?
2. ఆయన చిత్తానికి లోబడుటద్వారా ఈనాటినుండే ఆయనను సంతోషపరచుటకు మొదలిడుము.

---

గమనిక : సత్యవాక్కు అదనపు కాపీలు మీకు అందుచున్న యెడల వాటిపై నున్న మీ అడ్రెసు నంబర్లను తెలియజేయండి. మీరు M.O. పంపునప్పుడుగాని, మాకు వ్రాయునప్పుడు గాని మీ సత్యవాక్కు నంబరును దయచేసి తెలియజేయండి.

# తీగెలు మీరు

యోహాను 15వ అధ్యాయములో నేటి క్రైస్తవ ప్రపంచము, "నేను నిజమైన ద్రాక్షవల్లిని", "ద్రాక్షవల్లిని నేను, తీగెలు మీరు" యను వాక్యములను అపార్థము చేయుచున్నారు.

ద్రాక్షవల్లి ఒక్కటే ఐనను తీగెలనేకములైనట్లు మత శాఖలెన్నైనా యుండవచ్చు, ఎవరైనా క్రీస్తునే కదా ప్రకటిస్తున్నారు, దేవుణ్ణేకదా పూజిస్తున్నారు అని యనుట వాడుకయైనది. అయితే యిపుడొక ప్రశ్న : ఒకే ద్రాక్షవల్లినుండి వచ్చిన తీగెలు యేమి కాస్తాయి? ద్రాక్షలు. ఔనా? క్రీస్తునే ప్రకటించుచున్నామను మీరు బెండ, దొండ, బీర, కాకర, పొట్లకాయలు (భిన్న బోధలు, సంఘాలు, సభ్యులు) కాయుటకు గల కారణమేమి? $3\times3=7$ అని కొందరు, 8 అని కొందరు 10 అని కొందరు అనుటగల హేతువేమి? ప్రమాణ గ్రంథమును వదలివేయుటవలననే గదా? అందుకనే నేటి అబద్ధ బోధకులు - వాక్యము కాదు, అనుభవం కావాలి అంటారు. బైబిలు నొద్దకు వెళ్ళి చర్చించుటకు ఒప్పుకోరు.

క్రీస్తుయొక్క అపొస్తలులు బ్రదికియున్న కాలమునందే అబద్ధ బోధకులుండిరి. క్రైస్తవులను ధర్మశాస్త్రము పాటింపమని (అపొ 15:1), సున్నతి పొందమని (ఫిలిప్పీ 3:3), పండుగలు ఆచరింపమని (కొలస్స 2:20; గలతీ 4:10) కొందరు అబద్ధబోధకులు బోధింప మొదలిడిరి. గనుకనే గలతీ పట్టణస్థులైన క్రైస్తవులకు పౌలు వ్రాయుచు ఆ భిన్న బోధలను ఖండించెను. క్రీస్తుయొక్క రాకడ వెంటనే వచ్చునని కొందరు అసత్యముగా బోధించుటవలన జాగ్రత్తగా యుండి, అబద్ధ బోధకులను నమ్మవద్దని థెస్సలోనీకయలో యున్న క్రైస్తవులకు వ్రాసెను. ఈవిధముగా ఆదిమ క్రైస్తవులకు వ్రాయబడిన పత్రికలన్నియు అబద్ధబోధలను ఖండించుచున్నవి. నీవు క్రీస్తువలె మోమా

టము లేని బోధకుడవై తే ఖండించుట, గద్దించుట, బుద్ధి చెప్పుట నీయొక్క లక్షణమై యుండాలి. నీవు సత్యమును వెంటాడువాడవై యుండాలి.

## మత శాఖలకు కారణం

"సంఘ మొక్కటే" అని వాక్యము చెప్పుచుండగా యిన్ని మతశాఖ లుండుటకు గల కారణమేమి? అనుదినము క్రొత్త క్రొత్త పేర్లతో అనేక సంఘములు వెలయుటకు గల కారణమేమి? ఎప్పుడై నను ఆలోచించితివా? లేనట్లయితే దేవుని వాక్యమందలి కొన్ని హేతువులను చూడుము :

1. సత్యవాక్యమును సరిగా విభజించకపోవుటవలన (II తిమో 2:15)
2. వాక్యమును కలిపి చెరుపుటవలన (II కొరింథీ 2:17)
3. వాక్యమును అపార్థము చేయుటవలన (II పేతురు 3:16)
4. మానవులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుట వలన (మార్కు 7:7)
5. దేవుని నీతి నెఱుగక తమ స్వనీతిని స్థాపింప బూనుకొనుట వలన (రోమా 10:2, 3)
6. లేఖనములనుగాని దేవుని శక్తినిగాని ఎరుగక పొరబడుట వలన (మార్కు 12:24)
7. క్రీస్తు బోధనుండి ముందుకు సాగుటవలన (II యోహా : 9)
8. అబద్ధ బోధకులు నాశనకరమైన భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుటవలన (II పేతురు 2:1-2)
9. సత్యమును గాక కల్పనా కథలను బోధించుటవలన (II తిమోతి 4 : 3, 4)
10. భిన్నమైన సువార్త బోధించుటవలన (గలతీ 1:6-10).
1. దేవుని వాక్యమునకు కలుపుట, తీసివేయుటవలన (ప్రకటన 22:18, 19).

12. సత్యమును ఉన్నది ఉన్నట్లుగా ఉపదేశింపక పోవుటవలన (ఎఫెసీ 4:20)

13. దుర్నీతి వలన కలుగు బహుమానమును ప్రేమించి (2 పేతురు 2:10), వినువారికి అనుకూలమైన బోధలు చేయుటవలన (2తిమోతి 4:3).

14. లాభము సంపాదించుకొనగోరి కల్పనావాక్యములు చెప్పుటవలన (2 పేతురు 2:3)

15. సాతానుడు నీతి పరిచారకుల వేషము ధరించు కొనుటవలన (2 కొరింథీ 1:13-15).

16. భేదములను, ఆటంకములను కలుగజేయుటకు ఇంపైన మాటల వలనను, ఇచ్ఛకముల వలనను నిష్కపటుల మనస్సులను మోస పుచ్చుటవలన (రోమా 16:17,18).

17. అబద్ధికుల వేషధారణ వలన, అబద్ధబోధకులవలన (1తిమోతి 4:1; అపొ 20:29-31).

18. సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాషగల వారివలన (2థెస్స 2:11-12).

నేను నిజమైన ద్రాక్షవల్లిని అన్నప్పుడు నిజముకాని ద్రాక్ష వల్లులు యుండునను భావము స్ఫురించుచున్నవి. అందుకే యేసు - "పరలోకమందున్న నాతండ్రి నాటని ప్రతిమొక్కయు పెల్లగింప బడును" అనిబోధించెను. (మత్త 15:13).

అసత్యమునకును, దుర్నీతికిని, పాపమునకును, మతశాఖల తత్వ మునకును, శిక్షకును మూలమైన సాతానును వెంబడింతువా? లేక నీ ఆత్మను రక్షింప శక్తిగల క్రీస్తును అనుసరింతువా? "నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నాఆజ్ఞలు గైకొనిన యెడల నా ప్రేమ నిలిచియుందురు" అను

క్రీస్తుయొక్క ఐక్యతా సూత్రమును గైకొనుటకు యిష్టపడుచున్నావా? నిజమైన ద్రాక్షవల్లిలో యుండి ఆయన కొరకు ఫలించుటకు నిర్ణయించుకొంటివా? నీవు నిజముగా క్రీస్తును ప్రేమించుచున్నట్లయితే ఆయన ఆజ్ఞలకు లోబడవలసినదే (యోహాను 14:21). "దేవుని ఎరిగినవాడు మనమాట వినును, దేవుని సంబంధి కానివాడు మనమాట వినడు" (1 యోహాను 4:6). నీవు దేవుని సంబంధివి కాగోరుచున్నావా? అయితే నేడే క్రీస్తు అను నిజమైన ద్రాక్షవల్లిలో చేర్చబడుము. నీవును ఒకతీగవై ద్రాక్షలు ఫలించునట్లు దేవుడు నీకు సహాయము చేయును గాక!

— S. ప్రభుదాస్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA–533 001

To

..............................

..............................

..............................

..............................